క్లుప్తంగా

వెండి నాగ ప్రతిమల బహూకరణ



వెండి నాగప్రతిమలను అందజేస్తున్న దాతలు

షాద్‌నగర్: పట్టణ పరిధిలోని కిషన్‌నగర్ గ్రామ శివారులో ఉన్న కాశీ విఘ్నేశ్వర స్వామి ఆలయానికి శుక్రవారం పట్టణానికి చెందిన కొట్టె బసి లింగప్ప కుటుంబ సభ్యులు రూ.3లక్షల విలువ చేసే వెండి నాగప్రతిమలను బహూకరించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొట్టె గంగాధర్, కొట్టె ఆనంద్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు సజ్జల కాశీనాథ్, సజ్జల భువనేశ్వర్, అగ్గనూరు బస్వం, అర్చకులు సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు బంధుకు దరఖాస్తు చేసుకోండి

నందిగామ: అర్హులైన రైతులందరూ రైతు బంధు పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ వరలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ వరకు వ్యవసాయ భూములు కొనుగోలు చేసుకున్న రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకాలతో దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, సేవింగ్ బ్యాంకు పాసు పుస్తకం జీరాక్స్ కాపీలను తమకు అందజేయాలని ఆమె వివరించారు. గతంలో రైతు బంధు పొందని రైతులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె విజ్ఞప్తి చేశారు.

నక్ష బాటను కాపాడండి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న శ్రీరంగాపూర్ వాసులు

కొందుర్గు: నక్ష బాటను కాపాడాలని శ్రీరంగాపూర్ వాసులు శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరంగాపూర్ నుంచి షాబాద్ మండలం మన్‌మర్రి గ్రామానికి వెళ్లడానికి ఉన్న నక్ష బాటను మన్‌మర్రి గ్రామస్తులు కబ్జాచేస్తున్నారని వాపోయారు. దీంతో పరిసర పొలాల రైతులకు వెళ్లేందుకు ఇబ్బందిగా మారిందని అన్నారు. డిప్యూటీ తహసీల్దార్ స్పందిస్తూ విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.వినతిపత్రం అందించిన వారిలో సయ్యద్ సాదిక్, రమేష్ రెడ్డి ఉన్నారు.


నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శంకర్‌పల్లి: మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు శంకర్‌పల్లి మండల విద్యుత్ శాఖ ఏఈ ప్రదీప్ వర్మ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 132కేవీ దొంతాన్‌పల్లి, 11కేవీ మిర్జాగూడ, జనవాడ, ఇంద్రారెడ్డి నగర్, మేయాఖాన్ గడ్డ గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

980 మంది రోగులకు ఉచిత వైద్యం

కొందుర్గు: గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేదలకు ఉచితంగా వైద్యం అందించడమే ఆరోగ్యమస్తు లక్ష్యమని బీజేపీ నేత పాలమూరి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఉత్తరాసిపల్లి, బైరంపల్లి, మహదేవ్‌పూర్, రామచంద్రాపూర్, పులుసుమామిడి గ్రామాలలో 980 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి వైద్య సేవలు అందించేందుకు కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మోహన్‌సింగ్‌నాయక్, శ్రీశైలం, శంకర్, యాదయ్య, వెంకట్‌రెడ్డి, అశోక్, మల్లేష్, గణేశ్ రెడ్డి, భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి



పంచాయతీ భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

మొయినాబాద్‌రూరల్: గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని అజీజ్‌నగర్ సర్పంచ్ సంధ్యశ్రీశైలం అన్నారు. శుక్రవారం గ్రామంలో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

బస్సులు కిటకిట.. ప్రయాణం కటకట

అరకొర బస్సులతో తిప్పలు
- విద్యార్థులు, ప్రజలకు నిత్యం నరకం
- అదనపు బస్సులు వేయాలంటూ విన్నపాలు



అమ్డాపూర్ చౌరస్తాలో బస్సుల కోసం విద్యార్థుల నిరీక్షణ



జేబీఐటీ కళాశాల ఎదుట బస్సు ఎక్కేందుకు విద్యార్థుల అవస్థలు

మొయినాబాద్‌రూరల్: విద్యా సంస్థలు ప్రారంభంతో విద్యార్థులకు, ప్రజలకు ప్రయాణ కష్టాలు మొదలయ్యాయి. కరోనా సమయంలో తగ్గించిన బస్సులను తిరిగి నడపకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. గ్రామాలకు రెండు మూడు ట్రిప్పులు తప్పితే బస్సులు కానరాని పరిస్థితి నెలకొంది. ఈ నెల 12 నుంచి విద్యా సంస్థలు ప్రారంభం కావడంతో విద్యార్థులు వారి వారి కళాశాలలు, పాఠశాలలకు వెళ్తున్నారు. గ్రామాలకు అరకొర బస్సులు నడుస్తుండడంతో విద్యార్థులు సమయానికి విద్యా సంస్థలకు వెళ్లలేక, తిరిగి రాలేకపోతున్నారు. ప్రమాదం అని తెలిసినా ఆటోలు, ఇతర వాహనాలపై ప్రయాణిస్తూ గమ్యానికి చేరుకుంటున్నారు. కేవలం మండలాల స్థాయిలోనే బస్సులను నడిపిస్తున్నారు. మారుమూల ప్రాంతాలకు గతంలో 20–30 ట్రిప్పులు నడిచే బస్సులు ప్రస్తుతం 2–3 ట్రిప్పులతో సరిపెట్టడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సుల సంఖ్యను పెంచాలని ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు సంబంధిత అధికారులను కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు.

తప్పని సర్కస్ ఫీట్లు

వివిధ ప్రాంతాల నుంచి నగరానికి విద్యార్థులు ప్రతి రోజు సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తుంది. కాలేజీకి వెళ్లే సమయంలో సరిపడా బస్సులు నడపకపోవడంతో కిక్కిరిసి ప్రయాణం చేయాల్సి వస్తోంది. ప్రమాదం అని తెలిసినా ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తున్నారు. చేసేదిలేక కొంత మంది విద్యార్థులు ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సమయానికి బస్సులను నడపాలని కోరుతున్నారు.

బస్సు ట్రిప్పులు పెంచాలి



గ్రామాలకు వచ్చే బస్సుల సంఖ్యను పెంచాలని ఆర్టీసీ అధికారులకు విన్నవించాం. బాకారం గ్రామం నుంచి వందల సంఖ్యలో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు హైదరాబాద్ నగరానికి వెళ్లివస్తుంటారు. సమయానికి బస్సులు నడపడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. గతంలో బాకారానికి 32 ట్రిప్పుల బస్సులు వచ్చేవి. ప్రస్తుతం మూడు ట్రిప్పులు తిరుగుతున్నాయి. ఇప్పటికైనా బస్సుల సంఖ్యను పెంచాలి.

–కొత్తపల్లి రాఘవరెడ్డి, బాకారం సర్పంచ్

యథావిధిగా పెంపు

మండలంలోని అన్ని గ్రామాలకు గతంలో నడిపించిన విధంగానే బస్సుల ట్రిప్పులను పెంచుతున్నాం. విద్యా సంస్థల ప్రారంభంతో విద్యార్థుల కష్టాలను తెలుసుకొని ఉన్నతాధికారుల సూచనల మేరకే బస్సులు నడిచేందుకు కృషి చేస్తున్నాం. ఆయా గ్రామాలకు మరిన్ని ట్రిప్పులు వేసేలా ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

–వెంకటసూర్యనారాయణ, డిపో మేనేజర్

జోరువాన



హిమాయత్‌నగర్ చౌరస్తాలో జాతీయ రహదారిపై నిలిచిన వర్షం నీరు

మొయినాబాద్ మండల పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం వేళ భారీ వర్షం కురిసింది. బాకారం, ఎన్కెపల్లి, జీవన్‌గూడ, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, ముర్తుజాగూడ, అమ్డాపూర్, కాశీంబౌలి, నదీమ్‌నగర్ ఆయా గ్రామాల్లో దాదాపు రెండు గంటల పాటు వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. పంటపొలాల్లో, రోడ్లపై వరద నీరు పారింది. హిమాయత్‌నగర్ చౌరస్తా, అజీజ్‌నగర్ చౌరస్తాలో రోడ్లపై వర్షం నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. - మొయినాబాద్‌రూరల్

తొలకరి రాకతో కదులుతున్న అరకలు



మక్తగూడలో పత్తి విత్తనాలు వేస్తున్న రైతులు

షాబాద్: తొలకరి పలకరింతతో రైతన్నలు పొలంపనుల్లో తలమునకలవుతున్నారు. మండల పరిధిలో శుక్రవారం రైతులు విత్తనాలు వేస్తున్నారు. మండల పరిధిలోని మక్తగూడ, రేగడిదోస్వాడ, వెంకమ్మగూడ, తిర్మలాపూర్, ఏట్ల ఎర్రవల్లి, తాళ్లపల్లి, కక్కులూర్, కుర్వగూడ, సర్దార్‌నగర్, అంతారం, కేసారం తదితర గ్రామాల్లో రైతులు జొన్న, పత్తి, మొక్కజొన్న విత్తనాలను నాటుతున్నారు. పుడమి ఒడిలో తొలకరి జల్లులు రావడంతో పల్లెల్లో అరకలు కదులుతున్నాయి. సేద్యానికి సిద్ధమైన అన్నదాతలు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. నేల పదును చూసి దుక్కులు చేస్తున్నారు. కొన్ని చోట్ల విత్తనాలు వేస్తున్నారు. వరుణదేవుడు కరుణించడంతో పల్లెల్లో సేద్యం పండుగ ప్రారంభమైంది. తొలకరి పలకరించడంతో అన్నదాతలు హలం పట్టారు. ఆరుద్ర కార్తెలో విత్తనాలు వేస్తే పంట చీడపీడల నుంచి దూరంగా ఉంటుందనేది రైతుల విశ్వాసం.

శ్యాంప్రసాద్ ముఖర్జీ గొప్ప దేశభక్తుడు



షాద్‌నగర్: శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



చేవెళ్లలో నివాళులర్పిస్తున్న నాయకులు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: భారతీయ జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ గొప్ప దేశభక్తుడని, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. బలిదాన్ దివస్ కార్యక్రమాన్ని శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు శ్యాంప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కాశ్మీరు కోసం పోరాటాలు చేసిన మహానేత శ్యాంప్రసాద్ ముఖర్జీ అని అన్నారు. దేశంలో ఒకే జెండా, ఒకే పాలన ఉండాలని ఎన్నో పోరాటం చేశారన్నారు. మహానేత ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మిథున్‌రెడ్డి, మురళీ, వంశీకృష్ణ, మఠం రుషికేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు

చేవెళ్ల: దేశంలో ద్వంద్వ నీతికి వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప మహనీయుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలో శుక్రవారం బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో బలిదాన్ దివాస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన స్ఫూర్తితోనే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 370 ఆర్టికల్ రద్దు చేశారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సీనియర్ నాయకులు అడెట్ల శ్రీనివాస్, కుంచం శ్రీనివాస్, వికారాబాద్‌జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు శర్వలింగం, కృష్ణగౌడ్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఆడిట్ నిర్వహణ

- జిల్లా అసిస్టెంట్ అధికారి ఎంఏ గఫూర్
- ఎన్కెపల్లి పంచాయతీ కార్యాలయంలో రికార్డుల పరిశీలన

మొయినాబాద్‌రూరల్: గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులు, బిల్లులను క్షుణ్ణంగా పరిశీలించి ఆడిట్ చేస్తున్నామని జిల్లా అసిస్టెంట్ అధికారి ఎం.ఏ.గఫూర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎన్కెపల్లి పంచాయతీలో రికార్డులు, బిల్లులను పరిశీలించారు. గ్రామ సర్పంచ్ చందనచంద్రయ్య, కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డిల సమక్షంలో రికార్డులను, బిల్లులను పరిశీలించి నమోదు చేసుకున్నారు. ఏమైనా అనుమానాలు, కొట్టివేతలు ఉంటే వాటిని పై అధికారులకు తెలియజేస్తామన్నారు. ఏప్రిల్ నెల నుంచి మార్చి నెల వరకు 12 నెలలకు సంబంధించిన లెక్కలు, రికార్డులను ఆడిటింగ్ చేస్తున్నామని తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు ఏడు గ్రామాల్లో పూర్తి చేశామని సూచించారు. కార్యక్రమంలో ఆడిటింగ్ అధికారి ఫెరోజ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ చందనచంద్రయ్యలు ఉన్నారు.



ఎన్కెపల్లి పంచాయతీలో రికార్డులను పరిశీలిస్తున్న ఆడిట్ అధికారులు

కాంగ్రెస్ పటిష్టతకు కృషి



నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాన్ని అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

షాద్‌నగర్: కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చింతగూడెం గ్రామంలో పార్టీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను గడప గడపకు వెళ్లి వివరించి ప్రజలను చైతన్య పరచాలని అన్నారు. ఎన్నికల సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు అనేక హామీలు ఇచ్చాయని, వాటిని నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో కార్యకర్తలు పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా యాదయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజు, ఉపాధ్యక్షులుగా మల్లారెడ్డి, నర్సింహ్మారెడ్డి, రమేశ్, యాదయ్య, ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా మహేష్, శ్రీకాంత్, రమేష్, కోశాధికారిగా సురేష్, సహాయ కోశాధికారులు సూర్యప్రకాష్, శ్యాంసుందర్‌రెడ్డి, ప్రవీణ్, సభ్యులుగా వెంకటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ప్రమోద్‌రెడ్డి, రాధాకృష్ణ, ప్రవీణ్, రాజు, పర్వతాలు, జంగయ్య, కుమార్‌లను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాన్ని అందజేశారు.

దశాబ్ది ఉత్సవాలు విజయవంతం

నందిగామ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దశాబ్ది ఉత్సవాలు అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజల సహకారంతో విజయవంతంగా ముగిశాయని జెడ్పీ వైస్‌చైర్మన్ గణేష్ అన్నారు. నందిగామలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం 10వ వసంతంలోకి అడుగిడుతున్న నేపథ్యంలో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించామని చెప్పారు. విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్, నాయకుడు శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

‘ఉపాధి’ బిల్లులు చెల్లించాల్సిందే



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

- మండల సభలో సభ్యుల డిమాండ్
- సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపాటు
- అధికారులు పనితీరు మార్చుకోవాలి: ఎమ్మెల్యే

కొందుర్గు: ఉపాధిహామీ బిల్లులన్నీ చెల్లించాల్సిందేనని, సిబ్బంది ఇబ్బందులకు గురిచేయడం తగదని పలు గ్రామాల సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రీడా ప్రాంగణం, రైతువేదిక నిర్మాణం బిల్లులు నేటికీ సరిగ్గా రాలేదని వాపోయారు. ఎంపీపీ జంగయ్య అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ ఉపాధిహామీ నివేదిక సరిగ్గా ఇవ్వకపోవడం వల్ల కోట్ల రూపాయల పనులు జరిగినా కేవలం రూ.15 లక్షల పనులు జరిగినట్లు నివేదిక ఇవ్వడం దారుణమన్నారు. ఎమ్మెల్యే స్పందించి ఉపాధి అధికారుల పనితీరు మార్చుకోవాలని సూచించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ప్రస్తుతం రైతులు పచ్చిరొట్ట ఎరువుగా సాగుచేసుకోవడానికి జనుము విత్తనాలు సరఫరా చేయలేదని దీంతో రైతులు బ్లాక్‌లో అధిక ధర చెల్లించి కొనుగోలు చేయాల్సివస్తోందని లక్ష్మీదేవిపల్లి సర్పంచ్ నర్సింహులు వాపోయారు. ఇందుకు మండల వ్యవసాయాధికారి మధుసూదన్ స్పందించి ఈ ఏడాది జనుము విత్తనాలు సరిపడా రాలేదన్నారు. మండలంలోని బైరంపల్లి, చెక్కలోనిగూడ గ్రామాల్లో అంగన్‌వాడి భవనాలు లేకపోవడం వల్ల ఇబ్బందిగా ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. కొందుర్గు దళితవాడలో ఉన్న భవనంలో ఫ్లోరింగ్ పనులు పూర్తిచేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రతి మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని ఎంపీహెచ్‌ఈఓ ప్రభులింగం తెలిపారు. గ్రామాల్లో కరెంట్ తీగలు వేలాడుతున్నా పట్టించుకోకపోవడం బాధాకరమని సర్పంచ్‌లు రామచంద్రయ్య. నర్సింలు, ఆంజనేయులు వాపోయారు.

గురుకుల పాఠశాలల్లో కేజీ టూ పీజీ విద్య..

సమావేశంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటి వరకు 1001 గురుకుల పాఠశాలలు ఏర్పాటుచేశారని, గురుకుల పాఠశాలల్లోనే పీజీ వరకు స్థాయి పెంచి నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ ఏడాది కొత్తగా సర్కారు బడుల్లో విద్యార్థులకు రాగిజావను పంపిణీ చేస్తున్నామన్నారు. అదేవిధంగా పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు అందిస్తున్నామని అన్నారు. మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ రాగమ్మ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కవిత, వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, తహసీల్దార్ రమేష్‌కుమార్, ఎంపీడీఓ ఆంజనేయులు, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కొందుర్గు మండలం వెంకిర్యాల రోడ్డుపై వంతెన నిర్మాణం పనులకు ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు. అనంతరం టేకులపల్లిలో పాఠశాల భవనం ప్రారంభించారు.

పేదల సంక్షేమమే బీజేపీ ధ్యేయం

- పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్‌గుప్తా
- ఇంటింటి ప్రచారంలో పార్టీ నేతలు

షాద్‌నగర్‌రూరల్: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ సుపరిపాలన కొనసాగిస్తున్నారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేష్‌గుప్తా అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద, కాశిరెడ్డిగూడ గ్రామాలలో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్‌గుప్తా మాట్లాడుతూ... నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో అనేక అభివృద్ధి పథకాలను అమలు చేశారని అన్నారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరే విధంగా న్యాకులు, కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అందెబాబయ్య, వెంకటేష్‌యాదవ్, రఘుగౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకే పట్టం కట్టండి

మొయినాబాద్‌రూరల్: రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్ కోరారు. శుక్రవారం మండలంలోని హిమాయత్‌నగర్‌లో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కేంద్రం ఇచ్చిన నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతున్నాయని తెలిపారు. గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కల పెంపకం, శ్మశానవాటికలు, డంపింగ్ యార్డులు, ఉపాధి పనులు, రోడ్లు తదితర అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కేంద్ర ప్రభుత్వమే నిధులు వెచ్చిస్తున్నదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మురళీ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ మండల కేంద్రంలో..

మొయినాబాద్: మండల కేంద్రంలో నాయకులు గడప గడపకు బీజేపీ కార్యక్రమాన్ని చేపట్టారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ మోదీ ప్రభుత్వం చేపడుతున్న పథకాల వివరాలను వివరించారు. అదే విధంగా జనసంగ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సుపరిపాలన ..

కొందుర్గు: బీజేపీతోనే నీతివంతమైన పరిపాలన అందుతోందని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలచారి అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్లలో గడపగడపకూ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. భూపాలచారి మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు అందరూ కలిసిరావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాలమూరి విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీశైలం, కురుమయ్య, శ్రీను, నర్సింహులు, వెంకటేష్, శ్రీకాంత్, విజయ్, శ్రీనివాసు పాల్గొన్నారు.



షాద్‌నగర్ రూరల్: మొగిలిగిద్దలో బీజేపీ నేతల ఇంటింటి ప్రచారం



మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్‌లో పాల్గొన్న కంజర్ల ప్రకాశ్ తదితరులు



కొందుర్గు: పెద్దఎల్కిచర్లలో బీజేపీ నాయకులు